క్లుప్తంగా

నేడు ధ్వజారోహణం

సదుం: మండలంలోని భట్టువారిపల్లి భారతం మిట్ట వద్ద పెద్దిరెడ్డి భాస్కర్ రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం నుంచి మహాభారత యజ్ఞం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పాండవుల ఆలయంలో ధ్వజారోహణం కార్యక్రమం, ప్రత్యేక పూజలు చేపట్టనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి భక్తులు, వైఎస్సార్ సీపీ నాయకులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

మోడల్ స్కూల్‌లో పెరిగిన విద్యార్థుల సంఖ్య

పులిచెర్ల(కల్లూరు): పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లె వద్దనున్న ఆదర్శ పాఠశాలలో కొత్తగా 47 మంది విద్యార్థులు చేరినట్టు ఎంఈవోలు సిద్ధరామయ్య, పోకల తాతయ్య తెలిపారు. గతంలో ఇక్కడ 18 మంది విద్యార్థులు ఉన్నారని, ప్రస్తుతం ఆ సంఖ్య 47కు చేరిందని పేర్కొన్నారు. విద్యార్థుల సంఖ్య పెరగడంలో ప్రధానోపాధ్యాయుడు రవి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్టు తెలిపారు.

లక్ష్మారెడ్డికి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి దంపతులు

సదుం: వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తండ్రి లక్ష్మారెడ్డి 13వ వర్ధంతిని ఆదివారం ఎర్రాతివారిపల్లెలో జరుపుకున్నారు. ఎమ్మెల్యే దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి ఆయన సమాధితోపాటు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదానం చేశారు. అధిక సంఖ్యలో అభిమానులు హాజరయ్యారు. కార్యక్రమంలో తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, మాజీ ఎంపీపీ పెద్దిరెడ్డి ఇందిరమ్మ, సుధీర్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, అభినయ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్షం కోసం రైతుల ఎదురు చూపులు

పులిచెర్ల(కల్లూరు): ఈ ఏడాది ఖరీఫ్‌లో వర్షాధార పంటగా వేరుశనగ పంట వేయడానికి రైతులు పొలాలను దుక్కిదున్ని సిద్ధం చేసుకున్నారు. జూన్ ముగిసి జూలై రెండో వారం వచ్చినా వర్షం కురవకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో 750 ఎకరాల్లో పంట వేయాలని నిర్ణయించామని, వర్షం కురవకపోవడంతో ఈ ఏడు వేరుశనగ పంట సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఇంకో పది రోజుల్లో వర్షం పడకపోతే పంట వేసినా దిగుబడి రాదు. దీంతో ఏమిచేయాలో దిక్కుతోచని స్థితిలో రైతులు ఉన్నారు.

శ్యామ్ ప్రసాద్‌ముఖర్జీకి ఘన నివాళి



శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకి నివాళులర్పిస్తున్న నాయకులు

వి.కోట: భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ గొప్ప దార్శనికుడని బీజేపీ నాయకులు కొనియాడారు. వారు ఆదివారం వి.కోటలో ఆయన జయంతిని జరుపుకున్నారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ భారతదేశ ఐక్యతకు, సమగ్రతకు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ ఎంతో కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రామచంద్రుడు, శివ, గోపీనాథ్ పాల్గొన్నారు.

కాగతి వీఆర్ఏ మంగమ్మ మృతి

చౌడేపల్లె: మండలంలోని కాగతి పంచాయతీ వీఆర్ఏ మంగమ్మ(30) ఆదివారం మృతిచెందారు. ఆమె కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు తిరుపతి స్విమ్స్‌లో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు. ఆమె మృతిపట్ల తహసీల్దార్ పార్వతి, జెడ్పీటీసీ దామోదరరాజు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నాగభూషణరెడ్డి, సర్పంచ్ షంషీర్, ఎంపీటీసీ అపర్ణ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఘనంగా పీర్ల పండుగ



కొడతనపల్లెలో పీర్లను ఊరేగిస్తున్న భక్తులు

గుడుపల్లె: మొహర్రం సందర్భంగా ఆదివారం కొడతనపల్లెలో ముస్లింలు పీర్ల పండుగను ఘనంగా జరుపుకున్నారు. గ్రామం నడిబొడ్డున అగ్నిగుండం ఏర్పాటుచేసి నిప్పులు రగిల్చారు. పీర్లను విశేషంగా అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం గ్రామంలో ఊరేగించారు. పీర్లను అగ్ని గుండం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. కోర్కెలు తీరిన వారు అగ్నిగుండంలో బొరుగులు, ఉప్పు చల్లి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రబలిన జ్వరాలు

- నియోజకవర్గ జనాభా - 3.50 లక్షలు
- మొత్తం పంచాయతీలు - 90

- రోగులతో ప్రభుత్వాస్పత్రుల కిటకిట
- పీహెచ్‌సీల్లో భారీగా పెరుగుతున్న ఓపీలు
- మందులున్నా సరిపోని వైనం



కొలమాసనపల్లి పీహెచ్‌సీలో కిటకిటలాడుతున్న జ్వరపీడితులు

వర్షాకాలం ప్రారంభమైంది. అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. పట్టణాలతోపాటు గ్రామాల్లోనూ పారిశుద్ధ్యం లోపించడంతో దోమలు విజృంభిస్తున్నాయి. జ్వరాలు ప్రబలడంతో ప్రజలు ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో సిబ్బంది వైద్య సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. అత్యవసర మందులు అందుబాటులో లేకపోవడంతో వైద్యులు బయటికి రాసిస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదలకు పెద్ద పీట వేసిందని, కూటమి ప్రభుత్వం వైద్య రంగాన్ని నిర్వీర్యం చేస్తోందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

పలమనేరు: పలమనేరు మండలం కొలమాసనపల్లి, బైరెడ్డిపల్లి మండలం బైరెడ్డిపల్లి, తీర్థం, వి.కోట మండలం ఓగు, గంగవరం మండలం గంగవరం, పత్తికొండ, పెద్దపంజాణి మండలం పెద్దపంజాణి, రాయలపేటలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు వున్నాయి. నియోజకవర్గంలో 90 పంచాయతీలు వున్నాయి. వాటిలో 3.50 లక్షల మంది జనాభా వున్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించింది. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో జ్వరాలు ప్రబలుతున్నాయి. పలమనేరు మండలంలోని కొలమాసనపల్లి పీహెచ్‌సీలో ప్రతిరోజూ ఓపీ సగటున 40 నమోదవుతున్నాయి. ఇటీవల జ్వరాలు విజృంభించడంతో ఓపీల సంఖ్య 80కి పైగా చేరింది. ఇక్కడ నాలుగు బెడ్లు మాత్రమే ఉన్నాయి. ఎక్కువ మంది ఇన్‌పేషంట్లకు అత్యవసర వైద్యానికి ఇబ్బంది తప్పడం లేదు. వి.కోట మండలంలోని ఓగు పీహెచ్‌సీ, వి.కోట సీహెచ్‌సీలోనూ జ్వరాలతో బాధపడుతున్న వారు ఎక్కువగా వస్తున్నారు. కొన్ని మందులు వున్నా అత్యవసరానికి సంబంధించిన మందులను వైద్యులు బయటికి రాసిస్తున్నారు. పెద్దపంజాణి మండలంలోని రాయలపేట, బైరెడ్డిపల్లి మండలంలోని బైరెడ్డిపల్లి, తీర్థం ఆస్పత్రులు వున్నాయి. ఆయా పీహెచ్‌సీల్లో రిస్కులేని, అనుమానం ఉన్న కేసులను ఎక్కువగా 108లో పలమనేరు ఏరియా ఆస్పత్రికి రెఫర్ చేస్తున్నారు.

రక్తపరీక్షల విషయంలో నిర్లక్ష్యం

నియోజకవర్గంలోని ఎనిమిది పీహెచ్‌సీల్లో రోజుకు మొత్తం 400 మందికి పైగా రోగులు వస్తున్నారు. వీరిలో సగం మందికి పైగా వైరల్ జ్వరాలతో బాధపడుతున్న వారు వున్నారు. వీరికి ముందుగా సాధారణ చికిత్స మాత్రమే చేస్తున్నారు. జ్వరం తగ్గకుంటే మాత్రమే ల్యాబ్‌లో పరీక్షలు చేస్తున్నారు. టైఫాయిడ్ లాంటి జ్వరాలకు కొన్నిచోట్ల ప్రైవేటు ల్యాబ్‌లకు కొందరు రోగులు వెళుతున్నారు. అన్ని పీహెచ్‌సీలో ముందుగానే జ్వరపీడితులకు టెస్ట్‌లు చేస్తే బాగుంటుందని రోగులు అభిప్రాయపడుతున్నారు.



వి.కోట సీహెచ్‌సీలో ఓపీ కోసం వేచిఉన్న రోగులు



గంగవరంలో రోగుల వివరాలను ఆన్‌లైన్ చేస్తున్న సిబ్బంది

ఉన్నట్టుండి జ్వరం వచ్చింది



ముందుగా కాస్త ఒళ్లు నొప్పులు వచ్చాయి. ఆపై జ్వరం వచ్చింది. దీంతో ఆస్పత్రికి వచ్చాను. నేనేకాదు మా గ్రామంలో చాలామంది జ్వరాలతో బాధపడుతున్నారు. ఇక్కడి సిబ్బంది పరీక్ష చేసి సాధారణ జ్వరమేనని చెప్పారు. మాత్రలు ఇచ్చి పంపారు.

– ప్రమీల, గొల్లపల్లి

సీజన్ మారినందునే వైరల్ ఫీవర్స్



గతంలో ఓపీల సంఖ్య తక్కువగా ఉండేది. ఇటీవల సీజనల్ వ్యాధులు ఎక్కువయ్యాయి. జ్వరాలతో ఎక్కువమంది రోగులు ఆస్పత్రికి వస్తున్నారు. ప్రస్తుతానికి అవసరమైన మందులన్నీ అందుబాటులో ఉన్నాయి. కేసులు పెరిగితే ఇండెంట్ పెట్టాలి.

–డాక్టర్ అనౌకి, మెడికల్ ఆఫీసర్

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



ఆపరేషన్లకు ఎంపికైన వారితో కుప్పం పీఈఎస్ వైద్యాధికారులు

బైరెడ్డిపల్లి: మహతీ ఫౌండేషన్ సహకారంతో కుప్పం పీఈఎస్ ఆస్పత్రి ఆధ్వర్యంలో బైరెడ్డిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో 41 మందికి కంటి పరీక్షలు చేసి 8 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. ప్రతి నెలా మహతీ ఫౌండేషన్ సహకారంతో వైద్య శిబిరం నిర్వహించడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు నిహారిక, మౌనిక, రాజశ్రీ పాల్గొన్నారు.

ఉచిత కంటి పరీక్షలకు మంచి స్పందన

పలమనేరు: పట్టణంలోని రిక్రియేషన్ క్లబ్‌లో ఆదివారం చెన్నై శంకర్ నేత్రాలయ ఆస్పత్రి వైద్యులు నిర్వహించిన ఉచిత కంటి పరీక్షలకు మంచి స్పందన లభించింది. ఇందులో 60 మందికి పైగా రోగులు పరీక్షలు చేయించుకున్నారు. వారిలో పది మందికి పైగా ఆపరేషన్లకు ఎంపిక చేసినట్టు డాక్టర్ మురళీకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, టీకే షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తొలిఏకాదశి పూజలు



బైరెడ్డిపల్లె : విశేషాలంకరణలో కోదండరామస్వామి

గుడుపల్లె: మండలంలోని శివాలయాల్లో ఆదివారం తొలి ఏకాదశిని ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని కాడేపల్లె నాగదేశ్వరస్వామి, గుడివంక గంగధరేశ్వరస్వామి, మల్లప్పకొండ మల్లేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలు తమ ఇళ్లలో శివపార్వతుల చిత్ర పటాలను ఏర్పాటు చేసుకుని పూజలు చేశారు.

వి.కోటలో..

వి.కోట: తొలి ఏకాదశిని పురస్కరించుకుని మండలంలోని అన్ని ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వి.కోట పట్టణంలోని రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి, ఆంజనేయస్వామి ఆలయాల్లో ఉదయం ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె: మండలంలో ఆదివారం తొలి ఏకాదశి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాతురునత్తం సమీపంలో ఉన్న రేవణసిద్ధేశ్వరస్వామి, బైరెడ్డిపల్లె సమీపంలోని శ్రీ మేలేశ్వరస్వామి, పాతపేటలోని శ్రీ చెన్న కేశవస్వామి, బైరెడ్డిపల్లెలోని శ్రీ కోదండరామస్వామి, నాగిరెడ్డిపల్లె సమీపంలో వెలసిన శ్రీ సోమేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

గురు పౌర్ణమి రోజు శ్రీకృష్ణుని పూజించాలి

వి.కోట: అత్యుత్తమ భగవద్గీతను అందించిన శ్రీకృష్ణ పరమాత్ముడిని జగద్గురువుగా భావించి గురు పౌర్ణమి రోజు ఆయనను పూజించాలని మండల త్రైత సిద్ధాంత ప్రభోద సేవా సమితి సభ్యులు తెలిపారు. వారు ఆదివారం కుదువగడ్డ, ఆకులదొడ్డి, పత్రపల్లి గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం చేశారు. వారు మాట్లాడుతూ జ్ఞానం అందించేవారిని వారిని గురువు అని అంటారని తెలిపారు. అలాంటిది భగవద్గీత ద్వారా ప్రపంచానికే జ్ఞానాన్ని అందించిన శ్రీకృష్ణుని జగద్గురువుగా భావించి గురు పౌర్ణమి రోజున ఆయననే పూజించాలని వివరించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రభోద సేవా సమితి సభ్యులు కృష్ణ, ప్రకాష్, శరవణ, పార్థసారథి, ఇందిరా, రాణి పాల్గొన్నారు.

అందరూ భగవద్గీతను చదవాలి

పలమనేరు: అందరూ భగవద్గీతను చదవాలని త్రైత సిద్ధాంత ప్రభోద సేవా కమిటీ నిర్వాహకులు భాస్కర్ తెలిపారు. ఆయన ఆదివారం పలమనేరు పట్టణ సమీపంలోని నల్లగుట్లపల్లిలో భగవద్గీతపై ఇంటింటా ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ శ్రీకృష్ణ పరమాత్మ అందించిన మార్గాలు నేటి సమాజానికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అంతేగాక భగవద్గీతను చదవడం వల్ల మనలో జ్ఞానం పెంపొందుతుందని వివరించారు. కార్యక్రమంలో బాలాజీ, జ్యోతి, రెడ్డెమ్మ, రేఖ, కళ్యాణి పాల్గొన్నారు.

చింతచెట్ల నరికివేత



నేలకొరిగిన చింతచెట్టు

చౌడేపల్లె: తన పొలంలోని చింతచెట్లను దౌర్జన్యంగా నరికివేశారని చారాల పంచాయతీ ఓదులపేటకు చెందిన రైతు సురేంద్రరెడ్డి ఆదివారం పోలీసులకు ఫిర్యాదుచేశారు. అతను అదే గ్రామానికి చెందిన విశ్వనాథరెడ్డి వద్ద 22-13 లో 0.30 సెంట్ల భూమితోపాటు రెండు చింతచెట్లను కొనుగోలు చేశారు. వాటిని పక్కన భూమి వున్న రైతు అర్జున్ రెడ్డి నరికేశారని ఆరోపించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు. ఇదిలా వుండగా మండలంలో విచ్చలవిడిగా ఏళ్లనాటి భారీ చింతచెట్లను నరికేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.

ఘనంగా ఏకలవ్య జయంతి



పుంగనూరులో ఏకలవ్యుని చిత్రపటానికి పూలు వేస్తున్న రామకృష్ణ తదితరులు

పుంగనూరు(చౌడేపల్లె): పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో ఆదివారం ఏకలవ్య జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎరుకుల సంఘం అధ్యక్షుడు ఎం.రామకృష్ణ ఏకలవ్యుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఎరుకుల కులస్తులు అనాదిగా నిరాదరణకు గురవుతున్నారని వాపోయారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడం లేదని ఆరోపించారు. ఇకనైనా బాధ్యతగా ఎరుకుల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి ఎస్ఆర్.అశోక్, నరసింహులు, నాయకులు నాగేనాయక్, శ్రీనివాసులు, శేషాద్రి, నాగరాజ, హరి, శంకర, వెంకట్రమణ, బాలకృష్ణ, మంజునాథ్, కిరణ్, వినోద్ పాల్గొన్నారు.

పలువురు సచివాలయ ఉద్యోగుల బదిలీ

రొంపిచెర్ల: మండలంలోని పలు గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు బదిలీ అయ్యారు. బొమ్మయ్యగారిపల్లె వెల్ఫేర్ అసిస్టెంట్ కిషోర్‌కుమార్‌ను పులిచెర్ల సచివాలయానికి, రొంపిచెర్ల వెల్ఫేర్ అసిస్టెంట్ కిరణ్ కుమార్ ఎర్రపాపిరెడ్డిగారిపల్లె సచివాలయానికి బదిలీ అయ్యారు. అలాగే రొంపిచెర్ల-1 వెల్ఫేర్ అసిస్టెంట్ సూల్తానాను కల్లూరు-2 సచివాలయానికి వెళ్లారు. అలాగే బొమ్మయ్యగారిపల్లె సచివాలయం మహిళా పోలీసు రేష్మ కల్లూరు-2కు, ప్రసన్నాంబిక పీలేరుకు, బండకిందపల్లె సచివాలయానికి చెందిన భార్గవి పీలేరు మండలం ముడుపులవేములకు, గానుగచింత నుంచి సుమియాకౌసర్ చిచ్చిలివారిపల్లెకు, మోటుమల్లెల నుంచి వెన్నల చిత్తూరు మండలం కట్టమంచికి, రొంపిచెర్ల-1 ప్రశాంతిని పీలేరు మండలానికి బదిలీ చేశారు. పులిచెర్ల మండలం కమ్మపల్లెలో పనిచేస్తున్న నీలిమ రొంపిచెర్ల-2కు, పీలేరు నుంచి కె.శ్రీదేవి బొమ్మయ్యగారిపల్లెకు, పీలేరు రాఘవేంద్రనగర్ నుంచి ఎస్.మీనాక్షి రొంపిచెర్ల-1కు బదిలీ చేశారు. బొమ్మయ్యగారిపల్లె డిజిటల్ అసిస్టెంట్ సద్దాంహుస్సేన్‌ను పులిచెర్ల సచివాలయానికి, రొంపిచెర్ల-1 నుంచి ఇంతియాజ్‌ను కల్లూరు-2 సచివాలయానికి, మోటుమల్లెల నుంచి శ్రీనివాసులును కల్లూరు-1కు, పెద్దమల్లెల నుంచి మోహన్‌ను కావేటిగారిపల్లెకు బదిలీ చేశారు. వ్యవసాయ శాఖ నుంచి రొంపిచెర్ల-1 నుంచి వెంకటరమణ నాయక్‌ను పీలేరు మండలం తలపుల సచివాలయానికి, సుజాతమ్మను పులిచెర్ల మండలం ఎర్రపాపిరెడ్డిగారిపల్లెకు బదిలీ చేశారు. అలాగే బొమ్మయ్యగారిపల్లెకు పీలేరు మండలం నుంచి జి.తిరుమల, గానుగచింతకు సి.రాజేశ్వరి బదిలీ చేశారు.

ముగిసిన పీర్ల పండుగ



పుంగనూరులో ఏర్పాటు చేసిన అగ్నిగుండం

పుంగనూరు(చౌడేపల్లె): పుంగనూరు పట్టణంలోని సుభేదారువీధి, కుమ్మరవీధి ప్రాంతాల్లో పీర్ల పండుగ ముగిసింది. ఈ సందర్భంగా ముస్లింలు పీర్లను మేళతాళాల మధ్య పట్టణంలో ఊరేగించి నిమజ్జనానికి తీసుకెళ్లారు. ప్రపంచ వ్యాప్తంగా ముస్లింలు రంజాన్ తర్వాత పవిత్రమైన నెలగా మొహర్రంను జరుపుకుంటారు. ఇందులో భాగంగా పట్టణంలోని ఆయా ప్రాంతాల్లోని చావిడిలో పీర్లను కొలువుతీర్చి 13 రోజులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కుమ్మరవీధిలో ప్రజలు అగ్నిగుండం ఏర్పాటు చేసి నిప్పులను తొక్కారు. నిమజ్జనంలో భక్తులు కోర్కెలు తీరడంతో పీర్లపై మిరియాలు, బొరుగులు, డబ్బులు చల్లి మొక్కులు తీర్చుకున్నారు.

వెంటనే గ్రాట్యుటీ చెల్లించాలి



నిరసన తెలుపుతున్న పెన్షనర్ల సంఘం నేతలు

పలమనేరు: ఉద్యోగ విరమణ చేసిన వారికి వెంటనే గ్రాట్యుటీ చెల్లించాలని పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు సోమచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక బాలికోన్నత పాఠశాలలో ఆదివారం డివిజన్‌లోని పెన్షనర్ల సమావేశం నిర్వహించారు. ముందుగా వారు నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వమూ గ్రాట్యుటీ చెల్లింపులను ఆపలేదన్నారు. గత ప్రభుత్వం కోవిడ్ సమయంలోనూ వీటిని చెల్లించిందని గుర్తు చేశారు. పీఆర్సీ ఆలస్యమవుతున్న కారణంగా ఉద్యోగ విరమణ చేసిన వారు ప్రయోజనాలను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే ఇవ్వాలన్నారు. అదే విధంగా ఎంటీఎస్ టీచర్ల సమస్యలను పరిష్కరించాలన్నారు. స్థానిక సబ్ ట్రెజరీ కార్యాలయంలో పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సంఘం నేతలు శ్రీనివాసులు, పరుశురామ్, జగదీష్, ఉమాపతి, రెడ్డి శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేడు గ్రీవెన్స్‌డే

కుప్పం: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కడా కార్యాలయ అధికారులు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కడా పీడీ వికాస్ మర్మత్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇస్లామిక్ ఉగ్రమూలాలపై విచారణ చేయాలి

పుంగనూరు(చౌడేపల్లె): రాయచోటిలో ఇస్లామిక్ ఉగ్రమూలాలపై క్షుణ్ణంగా విచారణ చేపట్టాలని బీజేపీ మైనారిటీ మోర్చా నాయకుడు అయూబ్‌ఖాన్ డిమాండ్ చేశారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ రాయచోటిలో అరెస్టయిన ఇస్లామిక్ ఉగ్రవాదులు అబూబకర్‌సిద్ధిక్, మహమ్మద్‌అలీ దేశాన్ని అస్థిరపరిచే కుట్రలో భాగంగా స్లీపర్ సెల్స్‌ను సిద్ధం చేస్తున్నట్లు అనుమానం ఉందని తెలిపారు. స్థానికులు సహకారంతో అక్కడ సమగ్రంగా విచారణ చేయాలని కోరారు. కార్యక్రమంలో నరసింహులు, వెంకటప్ప, వెంకట్రమణ, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

పుంగనూరు(చౌడేపల్లె): మండలంలోని భీమగానిపల్లె పెట్రోల్ బంక్ సమీపంలో ఆదివారం బైక్ ఢీకొని ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని మిట్టచింతవారిపల్లెకు చెందిన శివశంకర్(45) బైక్‌లో పుంగనూరు నుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. భీమగానిపల్లె పెట్రోల్ బంక్ సమీపంలో కాలినడకన పుంగనూరు వెళుతున్న పెద్దపంజాణి మండలం కొలింపల్లికి చెందిన చలపతి(52)ని ఢీకొన్నాడు. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చలపతి పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు మదనపల్లె ఆస్పత్రికి రెఫర్ చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి



చౌడేపల్లె నేతలతో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

చౌడేపల్లె: కూటమి ప్రభుత్వం చేస్తున్న దౌర్జన్యాలు, అరాచకాలు, మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశించారు. ఆయన ఆదివారం సదుం మండలం ఎర్రాతివారిపల్లెలో చౌడేపల్లె మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుచేయడం లేదన్నారు. ప్రభుత్వ తప్పులను ప్రశ్నిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయిస్తోందని దుయ్యబట్టారు. ఈ క్రమంలో ప్రభుత్వ అరాచకాలను ప్రజలకు వివరించి గ్రామ స్థాయి నుంచి వైఎస్సార్ సీపీని బలోపేతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ నాగభూషణరెడ్డి, సింగిల్‌విండో మాజీ చైర్మన్ రవిచంద్రారెడ్డి, పద్మనాభరెడ్డి, సింగిల్‌విండో మాజీ డైరెక్టర్ రమేష్‌బాబు, సర్పంచ్ ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగన్ పర్యటనను విజయవంతం చేద్దాం



సదుం: సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ద్వారకనాథరెడ్డి



చౌడేపల్లెలో సమావేశమైన దామోదరరాజు, నాగభూషణరెడ్డి తదితరులు

సదుం/చౌడేపల్లె: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ నెల 9న జిల్లాలో పర్యటించనున్నారని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ఆయన ఆదివారం సదుం మండలం ఎర్రాతివారిపల్లెలో నాయకులతో మాట్లాడారు. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో మామిడి రైతులు మద్దతు ధర లేక తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ఈ క్రమంలో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బంగారుపాళెం మార్కెట్ యార్డుకు వస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో రైతులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం పర్యటన ఏర్పాట్లపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా పలువురు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకుపోగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, కొండవీటి నాగభూషణం, బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి, రెడ్డీశ్వర రెడ్డి, నాగేశ్వరరావు, రాజేష్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా చౌడేపల్లెలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.దామోదరరాజు, మండల కన్వీనర్ జి.నాగభూషణరెడ్డి ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఘనంగా రాజన్న జయంతి వేడుకలు

స్థానిక బస్టాండులో మంగళవారం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని తీర్మానించారు. అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో బోయకొండ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ మిద్దింటి శంకర్ నారాయణ, వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రుక్మిణమ్మ, సర్పంచుల సంఘం అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సింగిల్‌విండో మాజీ చైర్మన్ రవిచంద్రారెడ్డి, పార్టీ మండల ఉపాధ్యక్షుడు వెంకటరమణ, పద్మనాభరెడ్డి, టి.నాగరాజ, సాధిక్‌బాషా, రమేష్‌బాబు, రంగనాథ్, షఫీ, శ్రీరాములు, లక్ష్మీనర్సయ్య, శ్రీనివాసులు, ఆనందాచార్యులు, వినోద్‌రెడ్డి, మునికృష్ణమనాయుడు, గంగిరెడ్డి, శంకరప్ప, వెంకటరెడ్డి, శేఖర్, చెంగారెడ్డి పాల్గొన్నారు.

9న భారీ బైక్ ర్యాలీ

పలమనేరు: మామిడి రైతులను పరామర్శించేందుకు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 9న బంగారుపాళ్యానికి వస్తున్నారని ఆ పార్టీ పలమనేరు రూరల్ మండల కన్వీనర్ బాలాజీనాయుడు తెలిపారు. ఆయన పర్యటనను విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. ఈ నెల 9న మండలంలో పార్టీ శ్రేణులు గుడియాత్తం రోడ్డులోని డిగ్రీ కళాశాల నుంచి బైపాస్ రోడ్డులోని వైఎస్సార్ విగ్రహం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్టు తెలిపారు.